# నేను చేసింది తప్పా?

' సుశీ - సిపు '

ఆ రోజు రాత్రి ఓడియన్ థియేటరులో సినిమాచూచి రాత్రి 12గం॥లకు యింటికి బయలు దేరాను. మా యిల్లుచాలాదూరం. బస్సులులేవు - టాక్సీలో పోవడానికి జేబులో చాలినంత డబ్బులేదు. నడచివెళ్ల డంకంటె గత్యంతరము లేకపోయింది. పిండారపోసినట్లున్న వెన్నెట్లో మరునాడు ఆదివారమగుటచే ఆఫీసు గొడవ లేదు కదాయని మెల్లగా నడకసాగించాను. మనుష్య సంచారం అంతగాలేదు. అడపా దడపా మోటారుకార్లు, ఆటోరిక్షాలు రివ్వునపోతున్నవి. సాధారణంగానే నా బుర్ర అనేక ఆలోచనలతో దిమ్మెక్కి పోతుంటుంది. ఇక ఒంటరిగా ఏ అడ్డంకులు లేని వాతావరణంలో ఏదేదోయూహిస్తూ, ఆలోచిస్తూ ముందుకు సాగుతున్నాను. అక్కడక్కడ రోడ్ల కిరుప్రక్కలగల పేవ్ మెంట్లమీద పండుకొని నిశ్చింతగా నిద్ర పోతున్న బీదసాదలు నాలోసానుభూతిని, అనూయను రేకెత్తిస్తున్నారు. వాళ్ళలో అనేకులకు తినడానికి తిండి, ఉండటానికి యిల్లు, ఒంటినిండా గుడ్డలేదని వారివాల కమే తెలుపుతున్నది. అయినా వాళ్లలో గల తృప్తి, చిత్తశుద్ధి, నిశ్చింత లక్షలు వేలు ఆస్థి, ఆదాయంకలవారికుండదని నా కనిపించింది. పైనుండి కురుస్తున్నమంచు వలన తల, గుడ్డలు చల్లబడ్డవి. కొంచం చలిచలిగానున్నది. నేను ఒంటరిగాడిన్నైనా నా బుర్రలోని ఆలోచనా పరంపరలు, నా కూనిరాగాలు శ్రమ తెలియకుండా చిత్ర టాకీస్ దగ్గరకు చేర్చినవి. అప్పటికి షుమారు 1 గం॥ అయియుంటుంది. ఇంకాకొంచం ముందుకు పోయేసరికి ఒక పెద్దచెట్టునీడన ఎవరోవ్యక్తి కూర్చొని యున్నట్లు కనుపించింది. నాకు ఒళ్లు జల్లుమన్నది - కారణ మేమిటంటే మా. యూరికి పొరుగూరికి మధ్యమార్గంలో యిలాంటి చెట్టుక్రిందనే ఒకదయ్యముండేదని, అది అర్ధరాత్రప్పుడు ఆదారిన ఒంటరిగా పోయెవాళ్లను, గుర్రపు బండ్లనుసయితం అటకాయించి నానా అవస్థలపాలు చేసేదని వినియున్నాను. తల నిండా ముసుగు-వెన్నెట్లో గుర్తించగలిగి నంతవరకు స్త్రీయని పోల్చకలిగాను. సమీపానికి పోగానే ఆవ్యక్తి నావైపే నడువ సాగింది. నా ప్రక్కన ... ... నేను గమనవేగాన్ని తగ్గించి ఆ వ్యక్తిని పార జూచాను. ఒకయువతి - కళకాంతులుగల ముఖం; కాని శుష్కించిపోయి నీరసంగా కనుపించింది. నా వేషము, కట్టుచూచి తెలుగు వాణ్ణని అనుకొనియుంటుంది.

''బాబూ! పుణ్యముంటుంది - చాల ఆకలిగానున్నది. రెండు రోజులయింది అన్నంతిని - డబ్బేదైనా యివ్వండి'' అన్నది తొట్రుపాటుతో. తలమీది ముసుగు జారిపోయింది. వెన్నెట్లో ఆమె సహజ స్వరూపం బయటపడింది. వయస్సు 18,19

సంవత్సరములుంటవి. వేళకు తిండిలేక, పోషణలేక శుష్కించిన అవయవాలతో, జడలుకట్టిన వెంట్రుకలతో, దుమ్ముధూళి ఆవరించిన గుడ్డలతోనున్నా సహజంగా అందగత్తె అనిపించింది.

ఆమాటలు వినేసరికి ఏమి మాట్లాడాలో తెలియలేదు. జేబులోని సిగరెట్టు తీసి నిప్పుపుల్ల గీచి వెలగిస్తూ ఆమెముఖంవంక తేరపార జూచాను. ఆమె తలవంచుకున్నది,

"ఏమిటీ! డబ్బా - కానీ, అర్ధణాయిస్తే నీకాలేకడుపు చల్లారదు. ఇక రూపాయలు నీకు యూరకేనా ఎలాగదొరకుతాంయి? పోనీ నాతో ..." అన్నాను ఆయమ్మాయి ధోరణి పరీక్షచేయుడానికని. ఒక క్షణం ఆగి నావైపు తలెత్తిచూచి మీరూ లోకంతోపాటేనా అన్నట్లు మరల తల వంచుకున్నది.

"ఈ వేళటప్పుడు ఆకలేమిటమ్మాయి! ఈడొచ్చిన పిల్లవు - ఒంటరిగా తిరుగుతున్నావంటే ఆకలితీర్చుకోడానికాలేక.. నీలాంటి వాళ్లనుయీ మద్రాసు నగరంలో అనేక వేషాల్లో చూస్తునేయున్నాం. నిజం చెప్పు నీ సంగతేమిటో - లేకపోతేనిన్ను పోలీసులకు ఒప్పగిస్తాను" అన్నానుగట్టిగా.

"క్షమించండి! నిజానికినేను వ్యభిచారిని కాను. కాని నా భగ్గునమండుతున్న కడుపుకు అన్నంపెట్టించి మీకోర్కెను తీర్చుకోవచ్చు. నాదీనావస్థను, ఆకలి మంటను అవకాశంగా తీసికొని నన్ను వినియోగించుకున్నవారు కొందరున్నారు కాని వాళ్లు [illegible]

అక్కరతీర్చుకొని పారిపోయారు. మరి మీరు దేవుడులాగ కనుపిస్తున్నారు -ఏమి చేసినామీదయ." అంటూంటే గొంతు బొంగురుపోయింది. నిజంగా ఆకలికి నకనకలాడిపోతున్నది. సమీపంలో ఏదైనా టీపాపు ఉన్నదేమోనని చుట్టూ కలయజూచాను. కాని కనుచూపు మేరలో ఏదీకనుపించలేదు,

"మీ యిల్లెక్కడ?"

"నా కిక్కడ యిల్లులేదు. మాది యీ యూరు కాదు"

"చాల ఆకలితో నున్నట్లున్నావు పాపం!"—అవునన్నట్లు .ఏమీ మాట్లాడలేదు ఆమె.

"మరి యీ యూరు ఎందుకువచ్చినట్లు? ఈ ఒంటరిగా తిరుగడం ఏమిటి?"

"ఇది స్వయంకృతాపరాధం. నా తండ్రి వందయకరాల పొలంగల భూస్వామి. నన్నొక స్వార్థపరుడు సినిమా రంగంలో చేర్చి తారాపథానికెక్కిస్తానని ఆశపెట్టి యిక్కడికి పిలుచుకవచ్చాడు. మాఇంట్లో తెలియకుండ రు. 4000/-లతోటి, ఒంటిమీద 20 సవర్లనగలతోటి నేను అతనితో యిక్కడికివచ్చాను కొంతకాలం ఆడబ్బుతోటి మద్రాసునంతా వెంటేసుకొని త్రిప్పి, సినిమాలని, స్టూడియోలని, వినోదాలని, విలాసాలని నాలుగు వేలరూపాయలు కరుగదీశాడు. తర్వాత క్రమంగా నాపట్ల నిర్లక్ష్యం, నిరాదరణ అతనికి ఏర్పడి నన్ను ఒంటరిగా వదిలేశాడు. అతడు ఎక్కడున్నాడో నాకు ఆచూకి చిక్కలేదు. మా అమ్మ, నాన్న నాకోసరకని కొంత

వెదకించి చివరకు విసిగియూరుకున్నారు. నాకేంచేయాలో తోచలేదు. తిరిగియింటికి ఏ మొగంతో పోగలనాయని అనిపించింది. దగ్గరనున్న నగలను అమ్ముకొని జీ యాత్ర సాగించాను. తరాత్రకూడ కొందరు నన్ను పెండ్లిచేసికుంటామని, మరికొందరు సినిమాలలో చేరుస్తామని నా చుట్టూతిరిగి నన్ను వినియోగించుకొన్న పెద్ద మనుష్యులున్నారు చివరకు నా దగ్గర డబ్బుదుగ్గాణి అయిపోగానే చాలమంది మరుగు పడి పోయారు. అప్పటినుండి వారిదృష్టిలో ఎంగిలాకుగా కనుపించసాగాను. నాచుట్టూ చీకటి దట్టంగా అలముకుంది, ముందు వెనుకలు ఆలోచించకుండా చెప్పుడుమాటలు విని మోసపోయిన ఫలితంగా ఏర్పడిన పతనావస్థ నన్ను భయకంపితను చేసినది. ఇక నలుగురిలో ఉండలేక యిలా సందుల్లో గొందుల్లో అలమటిస్తున్నాను" అన్నదిలేని ఓపికతో సుదీర్ఘంగా.

"ఈ పరిస్థితులలో నాతోవస్తావా"

"అంతకంటె ఏంకావాలి ?"

నేను ముందు నడుస్తుంటే ఆమె వెనకాల కాళ్లీడ్చుకుంటూ అనుసరిస్తున్నది, సిగరెట్టు తగులబడి పోతున్నది. ఆమెను 'నా వెంట ఎందుకు రమ్మన్నానా' అనుకో సాగాను.

"నీ పేరేమిటి ?"

"సుగుణ"

"మీ దేవూరు ?"

"కారంచేడు"

"మీ యూరికి రైలెక్కించి పంపిస్తాను; వెళ్తావా!"

"ఈస్థితిలో నేను తిరిగి యూరికిపోతే తలెత్తుకోని తిరుగగలనాయనేదే నాబాధ"

ఇంతలో ఒకటీ షాపును సమీపించాము. అదీ మూత పడడానికి సిద్ధంగానున్నది. మేమిద్దరం లోపలికి పోయి ఆమెకు కడుపునిండా టిఫెను, టీ యిప్పించాను. నాకు మాత్రం యిలా ఎంతమంది ఆడపిల్లలు ముందు వెనుకలు ఆలోచన లేకుండా అపోహలకు గురియై పతనంచెందుతున్నారోకదాయని తోచింది. ఇట్టి వారు భిక్షుకులుగా, వ్యభిచారిణులుగా, దేశద్రిమ్మరులుగా కొల్లలై పట్టణాలలో నున్నారుకాబోలని యూహించాడు. ఈ పిల్లకైనా మంచి మార్గం చూపించాలనే నిర్ణయానికి వచ్చాను. ఆమె నా వెంట నడుస్తూ వచ్చింది. మా యిల్లుచేరాం. ఆ రాత్రి మాయింట్లో తలదాచుకుంది. మరునాడుదయం మా అమ్మ 'ఈ పిల్లఎవరురా' అంటూ సణుగుడు మొదలుపెట్టింది. నేనామెకు ముక్తసరిగా స్నేహితుని చెల్లెలని చెప్పి, స్నానంచేసి కాఫీ త్రాగిన తరువాత రెడీమేడ్ షాపులో గుడ్డలు తెప్పించి యిచ్చి నాతో బయలుదేరి రమ్మనాను. దారిలో మరల "అమ్మాయ్! యిప్పుడైనా నీవు మీ యూరికి తిరిగిపోతానంటే పంపిస్తాను. మరి నీ సంగతేదోచెప్పు" అన్నాను కటువుగా.

"భగవంతుని లాగ మీరు నన్నాదరించారు. ఏమిచేసినా మీదయ! తిరిగి యింటికి మాత్రం పోలేను"అన్నది ఆ పిల్ల బిక్క ముఖంతో.

బస్సు ఎక్కి మైలాపూరులోని స్త్రీ సేవా మందిరానికి మేమిద్దరం వెళ్లాం. అక్కడ

పాలక వర్గంవారికి ఆమెను ఒప్పజెప్పి విద్యాశిక్షణలకు ఏర్పాటుచేశాను. నేనే ఆమెకు గార్డియన్‌గాన మోదయ్యాను. నేనప్పుడప్పుడు చూచి వస్తూ యోగక్షేమాలను విచారించేవాడిని.

నాల్గుగు సంవత్సరాలు దొర్లిపోయినవి. ఆ యమ్మాయి చదువుకొని ఏటేటా పాసగుతూ వచ్చింది. మంచి తెలివితేటలు చురుకుదనము, నలుగురితో కలసిమెలసి యుండటం చూచి పాలకవర్గం, తోడివారు ఆమెను ఎంతో అభిమానంగాచూచేవారు.

ఒక రోజున మాఅమ్మమాటల సందర్భమున నా పెండ్లిప్రస్తావన చేసింది: నేను దులబరించుకొని వెళ్లిపోయాను. ప్రతిరోజు యూళ్లోను, చుట్టుప్రక్కల అవుతున్న పెళ్ళిళ్ళను గురించి, కట్నకానుకలనుగురించి, వధూవరుల యీడు జోడులనుగురించి అవకాశం చిక్కినప్పుడల్లా ఏకరుపెడ్తూ ''ఏమిరా! నేనుబ్రతికియుండంగా, నీ పెండ్లిచూసి చస్తానో లేదో'' అంటుండేది. అప్పటివరకు నరమానవుడితో చెప్పలేదు. కాని ఆనాడు మా అమ్మతో ''సుగుణను వివాహమాడతా''నన్నాను.

ఆ మాటకు ఆమె త్రుళ్ళిపడింది. ''అదేమిటిరా! దిక్కుమొక్కు లేని ఆ పిల్లను పెళ్లి చేసికోడమేమిటి!! కులమా గోత్రమా'' అన్నది ముక్కుమీద వ్రేలేసుకొని.

''ఏది ఏమయినా సరే ఆమెనే చేసికోదలచాను'' అన్నాను పెంకిగా. ఆమె యికతను మాట్లాడిలాభం లేదనుకొని యూరకున్నది నా మూర్ఖపు పట్టుదల తెలిసినది కాబట్టి.

సుగుణకు నాకు వివాహమయింది. బంధువులకంటె మిత్రులు అనేకమంది నన్ను అభినందించి ఆశీర్వదించారు. పెండ్లికి బంధువులు చాలమంది కులము, గోత్రము కాని దాన్ని, దిక్కు మొక్కు లేని అనాథను పెండ్లిచేసికున్నాననిరాలేదు. అనేకమంది యీసడించుకున్నారు. కొందరు చీవాట్లుపెట్టారుకూడా తర్వాత. అయినా ఆత్మ సమ్మతంగా ఒక పతనావస్థలోని యువతిని ఉద్ధరించాను కదా యని సగర్వంతో బంధువర్గాన్నంతా తృణప్రాయంగా చూచాను. ఈ సందర్భమున నేను చేసిన తప్పేమిటో చెప్పమని బహిరంగంగా నొక్కియడిగాను దానికి జవాబు?

—o—

## కృతజ్ఞత

అనేకమంది పాఠకులు నా సీరియల్ ''సాహసవీరులు''ను ప్రశంశిస్తూ లేఖలు వ్రాస్తున్నట్లు సంపాదకులు నాకు తెలిపినారు. పాఠకుల ఆదరాభిమానములకు ఎంతో కృతజ్ఞుడను. ఇకముందుకూడా క్రొంగొత్త పంథాలో వినోదం, విజ్ఞానం కలిగించే రచనలు వ్రాయగలనని వక్కాణించుచున్నాను. నా సీరియల్‌ను తమ పత్రికద్వారా ప్రచురించిన సంపాదకమహాశయులకు ఎంతో కృతజ్ఞుడను.

భవద్విధేయుడు,
కానాధిభట్ల వెంకటసుబ్బారావు.